క్లుప్తంగా

పది ఫలితాలపై దృష్టి సారించండి

ఆర్‌జేడీ నాగమణి

కంకిపాడు: పది ఫలితాలపై దృష్టి సారించాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ నాగమణి సూచించారు. పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. 8వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ట్యాబ్‌ల వినియోగం, పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్క విద్యార్థిపైనా ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని, ఫలితాల మెరుగునకు కృషి చేయాలని సూచించారు. విద్యాప్రమాణాల పెంపుదలకు ప్రత్యేక బోధనా పద్ధతులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కనకమహాలక్ష్మి, హెచ్‌ఎం పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవత సంస్థ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు వితరణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్ జంక్షన్ శాఖ కార్యాలయ నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, సిరి ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత నెరుసు శ్రీనివాసరావు మంగళవారం రూ.10 లక్షల చెక్కును మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావుకు అందజేశారు. విరాళం అందజేసిన నెరుసు శ్రీనివాసరావుకు మారుబోయిన కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి

గన్నవరం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం పెంచుకోవడంతో పాటు రైతులకు అవసరమైన సేంద్రియ ఎరువులను సరఫరా చేయాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. మండలంలోని అల్లాపురంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఆవరణలో మంగళవారం గుడివాడ డివిజన్ స్థాయి శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా చెత్త నుంచి సంపద సృష్టిస్తున్న అల్లాపురం కేంద్రం డివిజన్‌లోని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సాధారణ సేంద్రియ ఎరువుల కన్నా వర్మీ కంపోస్టు ఎరువుల్లో రెండింతలు పోషకాలు ఉంటాయని జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ధర్మరాజు తెలిపారు. గ్రామ సర్పంచి డొక్కు సాంబశివ వెంకన్నబాబు, ఎంపీటీసీ సభ్యులు గంతోటి ప్రశాంతి, ఇన్‌చార్జ్ ఎంపీడీవోలు ప్రసాద్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

నున్న గ్రామంలో వ్యాధులపై సర్వే

నున్న(విజయవాడరూరల్): వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం నున్న గ్రామంలో సంక్రమిత, అసంక్రమిత వ్యాధులకు సంబంధించిన సర్వే చేశారు. షుగర్, బీపీ, ఒబిసిటీ, క్షయ వ్యాధి, క్యాన్సర్ లాంటి వ్యాధులపై మూడు సచివాలయాల వైద్య సిబ్బంది సర్వే చేశారు. అవసరమైన వారికి ప్రభుత్వం సరఫరా చేసిన మందులను ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కె.రజని, శ్రీదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే మాకు శ్రీరామరక్ష

- ఎమ్మెల్యే పార్థసారథి ఎదుట లబ్ధిదారులు వెల్లడి
- కార్మికనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం



తాడిగడప కార్మికనగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత నవరత్నాల పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మంగళవారం తాడిగడప కార్మికనగర్ 2లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ఆనందం వ్యక్తం చేశారు. లబ్ధిదారు ధర్మపురి నరసింహారావు మాట్లాడుతూ వైఎస్సార్ పింఛన్ కానుక, ఆరోగ్యశ్రీ, ఆసరా, డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు సున్నా వడ్డీ తదితర పథకాలతో ఆర్థికంగా ఇబ్బందుల నుంచి బయటపడటమే కాకుండా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్నామని చెప్పారు.

మంచినీటి సమస్య పరిష్కరిస్తా..

కార్మికనగర్ 2లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందిస్తూ కార్మికనగర్‌లో వాటర్ ట్యాంకు మంజూరు చేసి త్వరలో నిర్మాణం చేయిస్తానన్నారు. ఈలోగా బోరు ఏర్పాటు చేస్తామని చెప్పారు. డ్రైనేజీల నిర్మాణంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్మికనగర్ ప్రాంతంలో యువకులు గంజాయి సేవిస్తున్నారని స్థానికులు చెప్పటంతో వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు బాబి, నర్రా చంటి, పి.సాంబయ్య, మేడసాని చిట్టి, క్రిస్టోఫర్, షేక్ జిన్నా, నల్లమోతు జీవన్, ఆకునూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి గీటురాయి గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: రాష్ట్ర ప్రగతికి గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ గీటురాయి అని, దేశంలో పారిశ్రామిక దిగ్గజాలు స్వయంగా వచ్చి సమ్మిట్‌లో పాల్గొన్నారని, దీంతో టీడీపీకి కడుపుమంటగా ఉందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మంగళవారం తాడిగడప సచివాలయం 2లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో నేడు ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారుతోందన్నారు. చంద్రబాబు పాలనలో హంగు ఆర్భాటాలతో కార్యకర్తలకు, డ్రైవర్లకు సూటు, బూటు వేసి హడావుడి చేశారని, నేడు వైఎస్ జగన్ హయాంలో దేశంలో హేమాహేమీలైన పారిశ్రామికవేత్తలందరూ స్వయంగా వచ్చారన్నారు. దీంతో చంద్రబాబు తట్టుకోలేక విషం కక్కుతున్నాడని ఆరోపించారు.

లోకేష్ ఒక జోకర్

లోకేష్ ఒక జోకర్ అని, అతను ఎందుకు పాదయాత్ర చేస్తున్నాడో ఆయనకే తెలియటం లేదని ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు. లోకేష్ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుని తానేమి చేస్తాడో ప్రజలకు చెప్పకుండా ఎగతాళిగా మాట్లాడుతూ జోకర్‌లా మారాడని విమర్శించారు. అనంతరం వైజాగ్ సమ్మిట్ విజయవంతం అయిన సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచి అన్నే చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు బాబి, మేడసాని చిట్టి, మాదు రమేష్, బబ్లూ, చాంద్‌బాషా, వల్లే నరసింహారావు, వీరబాబు, చెన్ను కృష్ణప్రసాద్, కోనేరు రమేష్, ఆకునూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ గీతాంజలిదేవి



ప్రసంగిస్తున్న బట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ గీతాంజలిదేవి



పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల ప్రదర్శన

పెనమలూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.గీతాంజలిదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం యనమలకుదురులో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు-పరిష్కార మార్గాలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ప్రసంగించారు. మహిళలకు సమస్యలు వచ్చిన సమయంలో మహిళా లోకం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.స్వరూపరాణి, ఎస్‌ఐ అర్జున్‌రాజు, ఐద్వా పట్టణ కమిటీ అధ్యక్షురాలు షేక్ వలీమా, కార్యదర్శి పాతాళలక్ష్మి పాల్గొన్నారు.

పీవీపీ సిద్ధార్థలో మహిళలకు సన్మానం

కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా చేశారు. లింగ వివక్ష, సమానత్వంపై విద్యార్థినులు నాటకం, నృత్య ప్రదర్శన చేశారు. డాక్టర్ అక్కినేని మణి, మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగించారు. రచయిత, సాహితీవేత్త డాక్టర్ వాడ్రేవు వరలక్ష్మి, కానూరు జెడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని రావి శారద, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వై.పద్మావతిలను సత్కరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు.

మహిళల హక్కులు కాపాడాలి : సీనియర్ సివిల్ జడ్జి రాజారామ్

మహిళల హక్కులను అందరూ కాపాడాలని, హక్కులకు భంగం కలిగితే చట్టపరంగా పరిరక్షిస్తామని సీనియర్ సివిల్ జడ్జి రాజారామ్ అన్నారు. గంగూరు సచివాలయంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల హక్కులపై సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళలకు అనేక హక్కులు ఉన్నాయన్నారు. ప్రతి మహిళ తన హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. గృహ హింస, వరకట్నం వేధింపులు, దిశ చట్టంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయసేవా సహాయకులు చిట్టూరి సుబ్బారావు, న్యాయవాది రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆటల పోటీల్లో ఓవరాల్ చాంపియన్ గన్నవరం

గన్నవరంరూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మచిలీపట్నంలో జిల్లా ప్రాధికార సంస్థ నిర్వహించిన ఆటల పోటీల్లో గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు టీమ్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. కబడ్డీ, ఖోఖో టీమ్‌లలో కె.హేమ, ఇందిర ప్రశాంతి, పార్వతి, స్రవంతి, ఎ.అనిత, బి.ఝాన్సీ, వెయిట్‌లిఫ్టింగ్‌లో ఎ.అనిత విజేతలుగా రాణించారు. వీరిని ప్రాజెక్టు డైరెక్టర్ కె.సువర్ణ, సీడీపీవో పి.వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి ప్రత్యేకంగా అభినందించారు.



ఓవరాల్ చాంపియన్‌గా రాణించిన గన్నవరం ఐసీడీఎస్ జట్టుతో సీడీపీవో వెంకటలక్ష్మి

వైభవంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న పాలడుగు నాని దంపతులు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపైకి శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను తీసుకువచ్చి పూజా కార్యక్రమాలను జరిపారు. అనంతరం ఉపసర్పంచి పాలడుగు నాని, అనంతలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళ వాయిద్యాల మధ్య శాస్త్రోక్తంగా అమ్మవారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి రూ.లక్ష విలువైన బంగారు మంగళ సూత్రాన్ని పాలడుగు నాని బహూకరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. అమ్మవారి కల్యాణాన్ని వీక్షించేందుకు పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ పండుగ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని బోడపాడు సుగాలీ కాలనీలో సుగాలీలు మంగళవారం హోలీ పండుగ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. సంప్రదాయబద్ధంగా యువకులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. ఆనందంతో నృత్యాలు చేశారు. వేడుకల్లో స్థానిక వార్డు సభ్యురాలు దారావతు స్వాతి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగు పెడతామంటూ బంగారం చోరీకి యత్నం

ఉంగుటూరు: బంగారు ఆభరణాలకు మెరుగుపెడతాం అంటూ బంగారం చోరీకి పాల్పడుతున్న వ్యక్తిపై ఆత్కూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం తెంపల్లి గ్రామంలో ఓ వ్యక్తి పాత వస్తువులకు మెరుగుపెడతాం అంటూ ఇంటింటికీ వెళ్లి మెరుగు పెడుతున్నాడు. ఈ క్రమంలో కొలుసు పద్మ అనే మహిళ ఇంటికి వెళ్లి పాత వస్తువులకు రూ.20కి మెరుగుపెడతాం అని చెప్పి బిందెకి మెరుగు పెట్టాడు. అదే సమయంలో ఆమె కోడలు రావడంతో నీ బంగారు గొలుసుకు మెరుగుపెడతామని మాయ మాటలు చెప్పి ఓ రసాయనిక ద్రావణంలో వేశాడు. బంగారం ఆ ద్రావణంలో మరుగుతుండటంతో బంగారాన్ని కొద్ది కొద్దిగా కరిగిస్తున్నట్లు తెలుసుకుని స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సూర్య శ్రీనివాస్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. నిందితుడు బిహార్‌కు చెందిన రంజిత్‌కుమార్‌గా గుర్తించి చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్వచ్ఛ సంకల్పం అందరి లక్ష్యం కావాలి

ఉయ్యూరు: జగనన్న స్వచ్ఛ సంకల్పమే అందరి లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే ఫ్లోరా రోడ్డు వెంబడి కాలువ పూడిక తీత పనులు మంగళవారం చేపట్టారు. ఈ పనులను చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ ఎంఏ బేగ్ పరిశీలించారు. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపాలిటీలో సంపూర్ణ పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నామన్నారు. ఫ్లోరా రోడ్డును అభివృద్ధి చేసే దిశగా పనులు ప్రారంభించామన్నారు. పనులను శానిటరీ ఇన్‌చార్జి సంతోష్ పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రత ప్రధానం

కంకిపాడు: పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని రిసోర్సు పర్సన్ నవరత్నం సూచించారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రత్యేక ఆదేశాలతో పునాదిపాడు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మంగళవారం కుందేరు, చలివేంద్రపాలెం, మొవ్వ, భట్లపెనుమర్రు గ్రామాల పంచాయతీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నవరత్నం మాట్లాడుతూ వ్యర్థాలతో సంపద సృష్టించటం ద్వారా పంచాయతీల ప్రగతి సాధ్యమవుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత మెరుగు పడుతుందన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి చెత్త సేకరణ, తడి చెత్త, పొడిచెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ దుర్గాప్రసాద్, కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, మునిరాజు పాల్గొన్నారు.





సంక్షిప్త వార్తలు

నేడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

ఉయ్యూరు: ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఈనెల 8వ తేదీన జరగనుంది. ఏఎంసీ చైర్మన్‌గా వల్లభనేని వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా దాసే రవికుమార్, డైరెక్టర్లుగా బిట్రా వెంకట కిరణ్మయి, మంచిగంటి భార్గవి, జంగా నాంచారమ్మ, కొక్కిలిగడ్డ మరియమ్మ, కొండపల్లి ఆదిలక్ష్మి, కూనపరెడ్డి అనూష, దారావత్తు బాబీ, పెనుమూడి వాణి, అబ్దుల్ సత్తార్, అమరపు సాంబశివరావు, గ్రంథి తిరుమల వెంకటేశ్వరరావు, ఆరేపల్లి నాగరాజు, ఊర నాగిన్, బొమ్ము లక్ష్మారెడ్డి, గండిగుంట సర్పంచ్ గెత్తం అనుపమతో కూడిన పాలకవర్గానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నూతన కమిటీ బుధవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక మార్కెట్‌యార్డు ప్రాంగణంలో బాధ్యతలు చేపట్టనుంది. ముందుగా దావులూరు టోల్‌గేట్‌వద్ద నుంచి సాయంత్రం 4 గంటలకు మార్కెట్‌యార్డు వరకూ భారీ ర్యాలీ ఉంటుందని నూతన చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

జల సంరక్షణే జన సంరక్షణ

గన్నవరంరూరల్: జల సంరక్షణే జన సంరక్షణ అని తెంపల్లి సర్పంచ్ కొలుసు శిరీష చెప్పారు. గ్రామంలో మంగళవారం గ్రామీణ మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ జరిగింది. సచివాలయం సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఉద్యోగులు, సచివాలయం కార్యదర్శి హర్షవర్ధిని, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి సంరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి

కంకిపాడు: కంటి సంరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి. రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కుందేరులో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 67 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ మద్దూరు రఘురాంప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

విజయవాడరూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని తహసీల్దార్ పి.జాహ్నవి అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఆమె వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నాలా ఫైల్స్, మ్యూటేషన్స్, కులధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్లు, ఫ్యామిలీమెంబరు సర్టిఫికెట్లు లాంటివి కూడా పెండింగ్‌లో ఉంచొద్దన్నారు. సమావేశంలో డీటీ విజయకుమార్, ఆర్‌ఐ రామ్‌సింగ్, మండల సర్వేయర్ రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

రామవరప్పాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు అంకితభావంతో పనిచేయాలని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, కైకలూరు నియోజకవర్గ పరిశీలకుడు మాదు శివరామకృష్ణ అన్నారు. గన్నవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం విజయవాడ రూరల్ మండలంలో నూతనంగా నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సిద్ధాంతాలను ఇంటింటికీ ప్రచారం చేయాలన్నారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు తమ దృష్టికి వచ్చిన ఏ చిన్న సమస్య అయినా అధికారులు, నాయకుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వ్యవసాయ మండలి సలహా చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం రంగారావు, రూరల్ మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షులు సాదం వెంకటేశ్వరరావు, పలుగ్రామాల కన్వీనర్లు, నాయకులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

చిక్కవరంలో ఘనంగా శ్రీమహాలక్ష్మీ జయంతి

గన్నవరంరూరల్: మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో మంగళవారం శ్రీమహాలక్ష్మీ అమ్మవారి జయంతి పండుగను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం గోపూజ, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించి తామరపువ్వులు, మారేడు దళాలతో, పాయసాన్నంతో శ్రీలక్ష్మీ నారాయణ హోమం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ కమిటీ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించింది.

దావాజీగూడెంలో...

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మీ జయంతి నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, విశేష అర్చనలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన జరిపారు. స్వామివారికి పరిమళభరిత పుష్పాలతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది.

కానూరులో ఘనంగా తిరుపతమ్మ తిరునాళ్లు

పెనమలూరు: కానూరులో శ్రీలక్ష్మీతిరుపతమ్మ, శ్రీగోపయ్యస్వామివారి దేవస్థానంలో మంగళవారం అమ్మవారి తిరునాళ్ల అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే భక్తులు నూతన వస్త్రాలు ధరించి దేవస్థానానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి గ్రామంలో ప్రభోత్సవం ఘనంగా చేశారు. రంగురంగు విద్యుత్ దీపాలతో ప్రభలను అలంకరించారు. కోలాటం, భజనలు, బేతాళ వేషాలు, డప్పులతో గ్రామంలో ప్రదర్శన చేశారు. భక్తుల సందడితో గ్రామంలో తిరుపతమ్మ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. నేడు ఉదయం గ్రామంలో అమ్మవారి గ్రామోత్సవం చేస్తారు.

సర్పంచ్‌కు సత్కారం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనికను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అమ్మ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత రాణి, పంచాయతీ కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మహిళా వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళల హక్కులు, భద్రత కోసం అమలు చేస్తున్న చట్టాలు గురించి జడ్జి బి.శిరీష వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్తల సోమేశ్వరరావు, ఎయిడ్స్ కౌన్సిల్ సభ్యురాలు దాసరి భాగ్యలక్ష్మి, మహిళా న్యాయవాది వాసవి పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉదయం రథోత్సవం, నిత్యార్చన, విశేష హోమాలు, పూర్ణా హుతి, వసంతోత్సవం జరిగాయి. సాయంత్రం ధ్వజావరోహణం, దీపోత్సవం, ద్వాదశ ప్రదక్షిణాలు, ఏకాంతసేవ, పుష్పోత్సవం కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది.

బందారుగూడెంలో సామూహిక కుంకుమార్చన

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మండలంలోని బందారుగూడెం కోదండ రామాలయంలో మంగళవారం మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ చేశారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ధర్మ ప్రచారక్ ఆళ్ళ జయశంకర్, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ ఎడవల్లి పాండు రంగారావు, ధర్మకర్త సుందరరావు, పామర్తి ప్రభ, నడిపల్లి వాణి, జుజ్జువరపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త

పెనమలూరు: యనమలకుదురులో భార్యపై భర్త దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు డొంకరోడ్డు కిందట శ్రీకాకుళం జిల్లా చిన్నాపురానికి చెందిన కె.భారతికి మారయ్యతో వివాహం అయింది. భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. అయితే భార్యభర్తల మధ్య వివాదం తలెత్తడంతో భారతి కొద్ది కాలంగా యనమలకుదురులో పుట్టింట్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం భర్త రామకృష్ణ యనమలకుదురుకు వచ్చి భారతితో తగాదా పడి ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

పెనమలూరు: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప వసంతనగర్ శ్మశాన వాటిక వద్ద తాడిగడపకు చెందిన కొక్కిలిగడ్డ మహేష్, కొనమాల తేజ, పటమటకు చెందిన పొన్నాడ యుగంధర్ గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

